సాక్షి అనకాపల్లి

మంగళవారం, 9, ఏప్రిల్, 2024



నేత్రపర్వంగా నృసింహుడి తిరువీధి

సింహాచలం: అమావాస్యను పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం సాయంత్రం తిరువీధి ఘనంగా జరిగింది.

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 34.5/25.0

రాగల ఐదు రోజులు ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు గరిష్ఠంగా 36.4, కనిష్ఠంగా 35.8 డిగ్రీలు నమోదుకావచ్చు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (మంగళ)	సహర్ (బుధ)
అనకాపల్లి	6.15	4.30
నర్సీపట్నం	6.18	4.28

మసీదులో కూటమి అభ్యర్థుల ప్రచారం

- ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించిన సీఎం రమేష్, కొణతాల



జామియా మసీదు వద్ద ఇఫ్తార్ విందులో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు సీఎం రమేష్, కొణతాల రామకృష్ణ, తదితరులు

అనకాపల్లి: ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించి బీజేపీ, జనసేన పార్టీల ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు సీఎం.రమేష్, కొణతాల రామకృష్ణ సోమవారం మసీదులో ప్రచారం చేశారు. టీడీపీ మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు మళ్ల సురేంద్రలతో కలిసి వారు స్థానిక పెరుగుబజార్ జంక్షన్ సమీపంలోని జామియా మసీదులో రంజాన్ మాసం సందర్భంగా ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అధికారంలోకి రాగానే షాదీఖానా నిర్మిస్తామని, ముస్లిం మహిళలకు కుట్టు మిషన్లు అందిస్తామని, ముస్లింల అభివృద్ధికి సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళతామని కూటమి అభ్యర్థులు హామీ ఇచ్చారు.

జేసీ పోలింగ్ కేంద్రాల పరిశీలన -2లో

భవిత బంగారం



ఉగాది సామగ్రి కోసం మార్కెట్ కిటకిట

ఉగాది కొత్త కాంతులు నింపుతుంది. కొంగొత్త ఆశలకు మొగ్గ తొడుగుతుంది. నూతన సంవత్సరాది వేళ ఈ భావన సర్వసాధారణం. కానీ వర్తమానం సాఫీగా సాగుతున్నప్పుడు.. బతుకుల్లో సంక్షేమం తాండవిస్తున్నప్పుడు కలిగే ఆలోచన.. 'భగవంతుడా.. ఇదే సంతోషం కొనసాగాలి.. ఈ అదృష్టం శాశ్వతం కావాలి.. మా సంక్షేమానికి ఏ దుష్ట శక్తీ అడ్డుపడకుండా నువ్వే చూడాలి'. ఔను.. ఇప్పుడు అందరి మదిలో మెదిలే భావన ఇదే. అందరి కోరిక ఇదే. జనుల మదిలోని బలమైన సంకల్పం .. తథాస్తు దేవతల దీవెన ఫలితం.. భవిష్యత్తు బంగారం.. ఈ ఏడాది ఉగాది పండగను సుఖ సంతోషాలతో జరుపుకోవడానికి అందరూ సిద్ధమయ్యారు. పచ్చి మామిడికాయలు, చెరకు గడలు, కొత్త బెల్లం, చింతపండు, వేప పూతల కొనుగోళ్లతో మార్కెట్లు కళకళలాడాయి. కొత్త దుస్తులు ఖరీదు చేసే వినియోగదారులతో వ్యాపార సముదాయాలు కిటకిటలాడాయి. ఉగాది పచ్చడి తయారు చేసేందుకు అవసరమైన కొత్త కుండల కోసం జనాలు ఎగబడ్డారు. నూతన సంవత్సరం తొలి రోజున ఆలయ దర్శనం, పంచాంగ శ్రవణం పరిపాటి. నక్కపల్లి మండలం ఉపమాకలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో తిరుమల తిరుపతి దేవస్థానం వారు విశ్రాంత తెలుగు పండిట్ ఆధ్యాత్మిక ప్రవచనకర్త డాక్టర్ వేదాల గాయత్రీదేవి ఆధ్వర్యంలో పంచాంగ పఠనం ఏర్పాటు చేశారు. ఇంకెందుకు ఆలస్యం.. శోభకృత్ నామ సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ క్రోధి నామ సంవత్సరానికి శుభ స్వాగతం చెప్పేద్దాం పదండి. -నక్కపల్లి

న్యూస్‌రీల్

15 నుంచి చేపల వేట నిషేధం

తుమ్మపాల: ఈ నెల 15 నుంచి జూన్ 14వ తేదీ వరకు సముద్రంలో చేపల వేట నిషేధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని జిల్లా మత్స్య శాఖ అధికారి ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ చేపలు, రొయ్యల జాతుల సంతానోత్పత్తి కాలంలో వాటిని సంరక్షించడం, సంతతి పెరుగుదలను ప్రోత్సహించడం, తద్వారా మత్స్య సంపద సుస్థిరతను సాధించాలనే లక్ష్యంతోనే 61 రోజుల పాటు చేపల వేట నిషేధాన్ని అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. యాంత్రిక పడవలు (మెకనైజ్డ్- మోటారు బోట్ల)పై మత్స్యకారులు ఎటువంటి చేపల వేట చేయకుండా మత్స్య అభివృద్ధికి సహకరించాలన్నారు. నిషేధ ఉత్తర్వులను ఉల్లంఘించిన బోటు యజమానులపై కేసులు నమోదు చేసి వాటిని స్వాధీనం చేసుకుంటామన్నారు.

జరిమానా విధించి డీజిల్‌తోపాటు అన్ని రకాల రాయితీలను నిలుపుదల చేస్తామని హెచ్చరించారు. ఈ నిషిద్ధ కాలంలో మత్స్యశాఖ, కోస్ట్ గార్డ్, కోస్టల్ సెక్యూరిటీ పోలీసులు, నేవీ, రెవెన్యూ అధికారులతో నిరంతర గస్తీ ఉంటుందన్నారు.

రౌడీ రాజకీయం

ప్రశాంతతకు మారుపేరుగా పేరొందిన అనకాపల్లి జిల్లాలో ఇప్పుడు కొత్త ముఖాలు కనిపిస్తున్నాయి. వారి కదలికలు సందేహాస్పదంగా ఉంటున్నాయి. వారి కార్యకలాపాలు శాంతిభద్రతలకు భంగం కలిగిస్తాయేమోనన్న భయాలు వ్యక్తమవుతున్నాయి. అనకాపల్లి పార్లమెంటు నియోజకవర్గం నుంచి పోటీ చేయనున్న బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి అభ్యర్థి సీఎం రమేష్ సాగిస్తున్న రౌడీ రాజకీయం ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశమైంది.

- గ్రామాల్లో సీఎం రమేష్ అనుచరులు
- సొంత జిల్లా నుంచి 200 మందికి పైగా రాక
- ఐదు గ్రామాలకు ఒకరు ఇన్‌చార్జ్
- పట్టణ ప్రాంతాల్లోని లాడ్జీల్లో మకాం
- టీడీపీ కార్యకర్తల పేరిట గదుల బుకింగ్
- రహస్య ప్రదేశాల్లో మద్యం డంప్‌ల ఏర్పాటు!



సాక్షి, అనకాపల్లి:

సీఎం రమేష్ అనుచరులైన రౌడీ మూకలు గ్రామాల్లో తిష్ట వేశాయి. స్థానికేతరుడైన ఆయనకు కూటమి నుంచి ఎంపీ టికెట్ ప్రకటించినప్పటి నుంచి.. మనుషులు మొదలుకొని ప్రచార వాహనాల వరకు అన్నీ తన స్వస్థలం కడప నుంచే తెచ్చుకున్నారు. 200మందికి పైగా అనుచరులను అనకాపల్లి జిల్లాకు రప్పించుకున్నారు. జిల్లాలో పట్టణ ప్రాంతాలైన అనకాపల్లి, చోడవరం, పాయకరావుపేట, యలమంచిలి, నర్సీపట్నం, మాడుగుల, సబ్బవరం, పెందుర్తిలలో ఉన్న లాడ్జీలలో వీరు మకాం చేశారు. ఈ పట్టణాల్లో శివారున ఉన్న లాడ్జిల్లో స్థానిక టీడీపీ కార్యకర్తల పేరిట రూమ్‌లు బుక్ చేశారు. కొన్ని రహస్య ప్రాంతాల్లో మద్యం డంపులను కూడా ఏర్పాటు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఇటీవల యలమంచిలి నియోజకవర్గం సోమలింగంపాలెంలో భారీగా గోవా మద్యం పట్టుబడింది. ఇందులో ప్రధాన నిందితుడు కర్రి వెంకటస్వామి టీడీపీకి చెందిన కార్యకర్త కావడం.. గోవా నుంచి కంటైనర్‌లో భారీగా మద్యం అనకాపల్లికి దిగుమతి చేయడం.. ఇక్కడ యలమంచిలి నియోజకవర్గ జనసేన అభ్యర్థి సమావేశానికి మద్యం సరఫరా చేయడం వంటివి గమనించిన పోలీసులు దీని వెనక బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ ఉన్నారా..? అని అనుమానిస్తున్నారు. ఈ కేసులో అరెస్ట్ చేసిన నలుగురినీ పోలీసులు విచారిస్తున్నారు. జిల్లాలో ఇంకేమైనా ఇలాంటి డంపులు ఉన్నాయా.. అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

ఐదు గ్రామాలకు ఒక్కరు..

సీఎం రమేష్ తన అనుచరులను ఇప్పటికే ఆయా నియోజకవర్గాల పరిధిలో ఉన్న మండల కేంద్రాలకు పంపించేశారు. ప్రతి ఐదు గ్రామాలకు ఒకరు చొప్పున జిల్లాలో ఉన్న 24 మండలాలతోపాటు పెందుర్తిలో కూడా వారిని మోహరించారు. సీఎం రమేష్ సమావేశాలు, టీడీపీ, జనసేన స్థానిక నేతల మీటింగ్‌లు, కుల సంఘాల సమావేశాల ఏర్పాటుకు ఎంత ఖర్చవుతుందో అంచనా వేసుకుని వారే సొమ్ము చెల్లిస్తున్నారు. సమావేశాల్లో పాల్గొనే నాయకులు, కార్యకర్తల ఆటో ఖర్చులు, వారి భోజనం ఖర్చులు, సమావేశ మందిరం అద్దెల చెల్లింపు వారి చేతుల మీదుగా జరుగుతోంది.

పవన్ వారాహి యాత్రకు రూ.50 లక్షలు

అనకాపల్లి జిల్లాలో ఆదివారం సాయంత్రం జరిగిన వారాహి యాత్ర, బహిరంగ సభ జన సమీకరణకు ఖర్చంతా సీఎం రమేష్ పెట్టుకున్నారు. సభ ఏర్పాట్లకు, జిల్లాలో ఉన్న ఏడు నియోజకవర్గాల నుంచి వచ్చిన జనానికి సుమారు రూ.50 లక్షలు వెచ్చించినట్టు సమాచారం. ఈ ఏర్పాట్లను కూడా సీఎం రమేష్ అనుచరులే దగ్గరుండి చూసుకున్నట్లు భోగట్టా.

వచ్చీ రాగానే ఘర్షణ మొదలు

రమేష్ అడుగు పెట్టారో లేదో.. అప్పుడే తనదైన రౌడీ రాజకీయాన్ని ప్రదర్శిస్తున్నారు. చోడవరంలో అధికారులపై దౌర్జన్యం, నర్సీపట్నంలో బహిరంగంగా చీరల పంపిణీ, గ్రామాల్లో సీఎం రమేష్ అనుచరుల హల్‌చల్ వంటి పరిణామాలను జిల్లా ప్రజలు అసహ్యించుకుంటున్నారు. ఇక్కడి ప్రశాంతతకు భంగం కలిగిస్తున్నారన్న భావం వారి మనసుల్లో అప్పుడే నాటుకుపోయింది. స్థానిక బీజేపీ నేతలు ఉండగా ప్రచార కార్యకలాపాలు, ఆర్థిక లావాదేవీలను పూర్తిగా తన మనుషులకు అప్పగించడం పార్టీ జిల్లా వర్గాల్లో అసంతృప్తిని రేకెత్తించింది. మామీద నమ్మకం లేదా అని వారు మనస్తాపానికి గురవుతున్నట్టు తెలుస్తోంది.

అమ్మకు నీరాజనం

- గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆలయంలో ఘనంగా కొత్త అమావాస్య వేడుకలు
- భారీగా తరలి వచ్చిన భక్తులు



నూకాంబిక అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు (ఇన్‌సెట్) అమ్మవారి మాలాధారణలో భారీ అంబలం పూజ

అనకాపల్లి: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు, గవరపాలెం శ్రీ నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య వేడుకలు సోమవారం అమ్మవారి బాలాలయంలో ఘనంగా జరిగాయి. ఆదివారం రాత్రంతా అమ్మవారి జాతరను భక్తులు ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు నూకాంబికను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి కుంకుమ పూజలు చేశారు. పలు స్వచ్ఛంద సేవా సంస్థలు, ఆలయ ఉద్యోగులు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకున్నారు. తాగునీరు, మజ్జిగ సరఫరా చేశారు. అమ్మవారి ప్రసాద వితరణ వంటి కార్యక్రమాలు చేపట్టారు. అమ్మవారి బాలాలయంలో నూకాంబిక అమ్మవారి మాలధారుల సంఘం వ్యవస్థాపకుడు పాలిమేర శ్రీను ఆధ్వర్యంలో భారీ అంబలం పూజలు నిర్వహించారు. వ్యాపారవేత్త కాండ్రేగుల నాయుడు, భాగ్యలక్ష్మి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

26న గర్భాలయ ముఖద్వార దర్శనం

అమ్మవారి నూతన ఆలయ నిర్మాణ పనులు జరుగుతున్నాయని, ఈ నెల 26న అమ్మవారి గర్భాలయ ముఖద్వార దర్శనానికి భక్తులకు అవకాశం కల్పిస్తామని ఆలయ ఈవో బండారు ప్రసాద్ చెప్పారు. ఎన్నికల కోడ్ నిబంధనలను పాటిస్తూ కొత్త అమావాస్య వేడుకలను నిరాడంబరంగా నిర్వహించామన్నారు. ఈనెల 9వ తేదీన శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలు అమ్మవారి ఆలయంలో నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

అంటే.. సుందరానికీ..!

- విజయకుమార్‌పై పవన్‌కు చిన్నచూపు అంటున్న జనసేన క్యాడరు
- తొలుత టికెట్ కేటాయింపుపై మీనమేషాలు
- తీరా ప్రకటించాక సీటు మార్చేందుకు యత్నాలు
- వారాహియాత్రలో యలమంచిలి సభ ఔట్
- అనకాపల్లి సభలో ఆయన పేరు ప్రస్తావనకే ఇష్టపడని కల్యాణ్
- ఏం జరుగుతుందోనన్న ఆందోళనలో సుందరపు వర్గీయులు



సాక్షి, విశాఖపట్నం : జనసేన యలమంచిలి అభ్యర్థి సుందరపు విజయకుమార్‌కు కాలం కలిసి రావడం లేదు. జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్, ఆయన సోదరుడు నాగబాబులకు అత్యంత సన్నిహితులమని హడావుడి చేసే ఆయనకు వారి నుంచే ఆశించిన ఆదరణ కనిపించడం లేదు. యలమంచిలి టికెట్ తనదేనని ఎప్పట్నుంచో చెప్పుకుంటున్న విజయకుమార్‌కు సీటు కేటాయింపులోనూ ఆలస్యమే జరిగింది. తీరా టికెట్ ఖరారు చేశాక కూడా మార్పు చేసేందుకు అధిష్టానం స్థాయిలోనే ప్రయత్నాలు జరిగాయి. ఏదోలా ఆ గండం నుంచి గట్టెక్కామనుకుంటున్న తరుణంలోనూ ఆయనకు ప్రశాంతత ఉండడం లేదు. తాజాగా అనకాపల్లిలో జరిగిన పవన్ కల్యాణ్ ఎన్నికల సభలో చోటు చేసుకున్న పరిణామం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఈ సభలో పవన్.. అనకాపల్లి, పెందుర్తి అభ్యర్థులతో పాటు అక్కడెక్కడ నుంచో పోటీ చేస్తున్న నాదెండ్ల మనోహర్, మండలి బుద్ధ ప్రసాద్‌లను గెలిపించాలని కోరారు తప్ప ఆ పక్క నియోజకవర్గం యలమంచిలి అభ్యర్థి సుందరపు విజయకుమార్ గురించి ప్రస్తావించనే లేదు. అంతేకాదు.. తన వారాహి వాహనంపైకి జనసేన అనకాపల్లి, పెందుర్తి అభ్యర్థులు కొణతాల రామకృష్ణ, పంచకర్ల రమేష్‌బాబు, టీడీపీ పార్లమెంట్ ఇన్‌చార్జి బుద్దా నాగ జగదీష్‌లను ఆహ్వానించారే గాని విజయకుమార్‌కు అవకాశం ఇవ్వలేదు. తనను వారాహి పైకి పిలుస్తారని ఎదురు చూసిన ఆయనకు తీవ్ర నిరాశే ఎదురైంది. పైగా అభ్యర్థికాని నాగ జగదీష్‌కు చోటివ్వడంతో విజయకుమార్‌తో పాటు ఆయన వర్గీయులు జీర్ణించుకోలేకపోతున్నారు. అంతేకాదు.. తొలుత ప్రకటించిన షెడ్యూల్‌లో సోమవారం యలమంచిలిలో పవన్ సభ ఉంది. కానీ అనారోగ్యం పేరిట అనూహ్యంగా దానిని రద్దు చేసుకుని అటు నుంచి అటే హైదరాబాద్ వెళ్లిపోయారు.

మార్పు తప్పదా?

ఇదంతా ఉద్దేశపూర్వకంగానే చేశారన్న అనుమానం జనసేన శ్రేణుల్లో బలంగా నాటుకుపోయింది. ఎందుకంటే.. యలమంచిలి జనసేన సీటును మారుస్తారన్న ప్రచారం కొన్నాళ్లుగా జోరుగా సాగుతోంది. పెందుర్తి సీటును పంచకర్లకు అధికారికంగా కేటాయించినా ఆ స్థానాన్ని తనకు ఇవ్వాలని మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి గట్టిగా పట్టుపడుతున్నారు. టీడీపీ నాయకులు బుజ్జగించినా ఆయన తగ్గేదే లే అంటున్నారు. తన అనుచరులతో రోజూ రోడ్డెక్కించి ఆందోళనలు చేయిస్తున్నారు. ఈ నేపథ్యంలో యలమంచిలి సీటు నుంచి విజయకుమార్‌ను తప్పించి పంచకర్లకు ఇస్తారని, పెందుర్తి టికెట్‌ను బండారుకు కేటాయిస్తారన్న ప్రచారం బాగా ఊపందుకుంది. తాజాగా పవన్ కల్యాణ్ వ్యవహార శైలి అందుకు అనుగుణంగా ఉండడం వీరి ప్రచారానికి బలం చేకూరుతోంది. ఆది నుంచీ సుందరపుపై పవన్‌కు చిన్న చూపేనన్న అనుమానం ఆయన వర్గీయుల్లో ఉంది. అందుకనుగుణంగానే తాజా పరిణామాలుండడంతో ఏం జరుగుతుందోనన్న ఆందోళన వీరిలో వ్యక్తమవుతోంది.

పండగ పూట పాము కలకలం



స్థానికుల చేతిలో హతమైన భారీ పాము

నాతవరం: పండగ పూట కుటుంబ సభ్యులంతా సరదాగా గడుపుతున్న సమయంలో ఇంట్లో పాము కనిపించి భయాందోళనకు గురి చేసింది. మండలంలోని మాధవనగరంలో సోమవారం కలిదిండి రాజులమ్మ ఇంట్లో పాము కలకలం రేపింది. అందరూ ఇంట్లోనే ఉన్న సమయంలో పాము బుసలు కొడుతూ కన్పించింది. దీంతో అందరూ బయటకు పరుగులు తీశారు. గ్రామస్తులు చేరి పామును హతమర్చారు. సుమారు 15 అడుగుల పొడవున్న పామును గ్రామస్తులు ఆసక్తిగా చూశారు.

మైనార్టీలకు మేలు చేసింది జగన్ ప్రభుత్వమే

- ముస్లింల ఆత్మీయ సమావేశంలో సమన్వయకర్త కంబాల జోగులు



ముస్లిం ఆత్మీయ సమావేశంలో కంబాల జోగులు

నక్కపల్లి: ముస్లిం మైనార్టీలకు మేలు చేసింది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనని పాయకరావుపేట నియోజకవర్గ సమన్వయకర్త, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ అన్నారు. సోమవారం నక్కపల్లి సుబ్బరామిరెడ్డి కల్యాణ మండపంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన ముస్లిం సోదరులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం ముస్లింలను కేవలం ఓటు బ్యాంకు రాజకీయాలకే వాడుకుందన్నారు. దివంగత మహానేత వైఎస్సార్ హయాంలో ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్లు కల్పించారన్నారు. ఇదే పంథాను ఆయన తనయుడు ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. ముస్లింలకు డిప్యూటీ సీఎం పదవితోపాటు, పలు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ తదితర పదవులను కేటాయించారన్నారు. 2009 నుంచి ముస్లింలంతా జగన్ వెంటే ఉన్నారని పేర్కొన్నారు. అర్చకులకు, పాస్టర్లకు, ఇమాంలకు ఏటా ఆర్థిక సాయం అందించడమనేది రాష్ట్ర చరిత్రలో ఎప్పుడూ జరగలేదన్నారు. దీన్ని కూడా టీడీపీ, జనసేన పార్టీలు తప్పు పడుతుండటం శోచనీయమన్నారు.

ఏ ప్రభుత్వ హయాంలో మంచి జరిగిందో మీరే గుర్తించాలన్నారు. నియోజకవర్గంలో కూడా ముస్లింలకు గుర్తింపు ఇస్తున్నామన్నారు. స్థానిక ఎమ్మెల్యే గొల్ల బాబూరావు తన అభివృద్ధి నిధులతోపాటు, రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి, అనకాపల్లి ఎంపీ డాక్టర్ సత్యవతి ఎంపీ ల్యాడ్స్ నిధుల నుంచి నక్కపల్లి మండలంలో ఉన్న పలు ముస్లిం గ్రామాల్లో తాగునీటి సమస్య, మసీదులకు రోడ్ల సమస్య, ప్రహరీ గోడల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించామన్నారు. మంచి జరిగింది అనిపిస్తేనే జగనన్న ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. సమావేశంలో ఎంఎస్ఎంఈ చైర్మన్, మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణ రాజు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి దత్తుడు సీతబాబు, మండల అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి, ధనిశెట్టి బాబూరావు, ముస్లిం నాయకులు తాజుద్దీన్, మున్నీసా, బాబా, ఉమర్, ఖాలీసా తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన ముస్లింలు

జేసీ పోలింగ్ కేంద్రాల పరిశీలన

కశింకోట: మండలంలోని పలు గ్రామాల్లో ఎన్నికల పోలింగ్ బూత్‌లను జాయింట్ కలెక్టర్ జాహ్నవి సోమవారం పరిశీలించారు. స్థానిక డీపీఎన్ జెడ్పీ హైస్కూలు, బాలికల ప్రాథమిక పాఠశాలలో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలకు ఏర్పాటు చేయనున్న కేంద్రాలను, స్కూళ్లలో సదుపాయాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బాలికల పాఠశాలలో సదుపాయాలను మెరుగుపర్చాలని ఆదేశించారు. జి. భీమవరం, సింగవరం, చింతలపాలెం, జమాదులపాలెం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను కూడా ఆమె పరిశీలించారు. అక్కడ కూడా ఓటర్లకు అవసరమైన సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. క్యూ పద్ధతి పాటించేలా బారికేడ్లు ఏర్పాటు చేయాలని, టాయిలెట్లను ఉపయోగంలోకి తేవాలన్నారు. తహసీల్దార్ ఎల్.మధుసూదన, ఎంపీడీవో శేషుబాబు, ఎంఈవో మూర్తి, సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.



కశింకోట బాలికల ప్రాథమిక పాఠశాలలో పోలింగ్ బూత్‌లను పరిశీలించిన జేసీ జాహ్నవి

పంచదార చిలక.. రంగుల చేట



అమ్మకానికి సిద్ధంగా ఉన్న పంచదార చిలకలు



రంగుల చేటలు

- నేడు పాయకరావుపేటలో చిలకల తీర్థం
- పేరంటాలమ్మ గుడి వద్ద భారీ తిరనాళ్లు
- సెంటిమెంట్‌తో చిలకలు, చేటలు కొనుగోలు

నక్కపల్లి/ పాయకరావుపేట: పంచదార చిలకలు.. రంగుల చేటలు.. వీటి పేరు వింటే ఠక్కున గుర్తుకొచ్చేది చిలకల తీర్థం. రంగు రంగుల చిలకలు, చేటల కోసం ఉగాదినాడు పాయకరావుపేటలో జరిగే చిలకల తీర్థానికి వెళ్లాల్సిందే. 50 ఏళ్లుగా పేరంటాలమ్మ ఆలయం వద్ద జరుగుతున్న ఈ చిలకల తీర్థానికి తూర్పుగోదావరి, విశాఖ జిల్లాల నుంచి అధిక సంఖ్యలో జనం వస్తారు. చిలకలు, చేటలు భారీగా అమ్ముడవుతాయి.

ఆలయంలో ఏటా పేరంటాలమ్మతల్లికి మలిపెద్దివారి కుటుంబీకులు తొలిపూజ నిర్వహించడం ఆనవాయితీ. అమ్మవారికి బోనాలు తీసుకెళ్లి పసుపు, కుంకుమలతో ప్రత్యేక పూజలు చేస్తారు. పేరంటాలమ్మ గుడికి వచ్చిన వారు పంచదార చిలక, రంగుల చేట కొనుక్కోవడం ఆనవాయితీగా మారింది. వీటిని కొనుగోలు చేసి ఇళ్లకు తీసుకువెళ్తే నిండు నూరేళ్ల సౌభాగ్యంతో ఉంటారని మహిళల నమ్మకం. చేటలు, చిలకల విక్రయాలు భారీగా జరుగుతుండటంతో కాలక్రమేణా దీనికి చిలకల తీర్థంగా పేరొచ్చింది. ఈ తీర్థంలో చిలకలు, చేటలు వివిధ రంగుల్లో తయారుచేసి వివిధ సైజుల్లో విక్రయిస్తారు. చిలకలు, చేటలు ఇంటికి తీసుకువెళ్లి దేవుడువద్ద వుంచి పూజిస్తారు.

పంచదార, వెదురు రేట్లు పెరగడంతోపాటు పనిచేసేవారికి కూలి రేట్లు ఎక్కువగా వున్నాయని తయారీదారులు చెబుతున్నారు. మార్కెట్‌లో పంచదార కిలో రూ.60. వెదురు ధరలు కూడా భారీగా ఉన్నాయి. అరకిలో చిలక రూ.60, ముప్పావు కిలో రూ.80, కిలో చిలక రూ.100 నుంచి 120లకు విక్రయిస్తారు. ఇక రంగుల చేటలయితే రూ.50ల వరకు అమ్ముతారు. సాయంత్రం భారీ తిరనాళ్లు జరుగుతుంది. పాయకరావుపేట, ఎలమంచిలి, నక్కపల్లి, అడ్డురోడ్డు, తుని అన్నవరం, కోటనందూరు తదితర ప్రాంతాల నుంచి వేలాది మంది ఈ తిరనాళ్లకు తరలివస్తారు. దీంతో మెయిన్ రోడ్డు కిటకిటలాడుతుంది. తుని వెళ్లాలంటే వై జంక్షన్ నుంచి బైపాస్‌రోడ్డు, సుగర్‌ఫ్యాక్టరీ జంక్షన్ మీదుగా వెళ్లాల్సి ఉంటుంది. కేవలం కాలినడకన తప్ప ద్విచక్రవాహనాల్లో వెళ్లడానికి వీలుపడదు. వాహనాల్లో వెళ్లాలంటే రాత్రి 11గంటల తర్వాతే వెళ్లాల్సి ఉంటుంది.

భారీ బందోబస్తు

ఉగాది నాడు పాయకరావుపేటలో చిలకలతీర్థాన్ని పురస్కరించుకుని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సీఐ అప్పలరాజు తెలిపారు. సాయంత్రం 4 గంటల నుంచి పాయకరావుపేట పట్టణం నుంచి తుని పట్టణానికి రాకపోకలు తాత్కాలికంగా నిలుపుదల చేశామన్నారు. ట్రాఫిక్ సమస్యలను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు.

జగన్ మళ్లీ సీఎం కావడం తథ్యం

- బస్సు యాత్రకు వస్తున్న ప్రజాదరణే నిదర్శనం
- రాష్ట్ర సృజనాత్మకత, సాంస్కృతిక కమిషన్ హెడ్ జోగినాయుడు



నూకాలమ్మను దర్శించుకున్న రాష్ట్ర సృజనాత్మకత, సాంస్కృతిక కమిషన్ హెడ్ జోగినాయుడు

నాతవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బస్సు యాత్రకు వస్తున్న ప్రజాదరణ చూస్తే జగన్ మళ్లీ సీఎం కావడం తథ్యమని సినీ నటుడు రాష్ట్ర సృజనాత్మకత, సాంస్కృతిక కమిషన్ హెడ్ ఎల్.జోగినాయుడు అన్నారు. ఆయన సోమవారం కుటుంబ సమేతంగా జిల్లేడుపూడిలో బుచ్చెంపేట నూకాలమ్మ తల్లిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో విలేకరులతో మాట్లాడారు. బస్సు యాత్ర ప్రారంభంలో సీఎం జగన్‌తోపాటు ఇడుపులపాయకు వెళ్లి, రెండు రోజుల పాటు అయనతో బస్సు యాత్రలో పాల్గొన్నట్లు తెలిపారు. రాజకీయాలకతీతంగా సంక్షేమ పథకాలు అందుకున్న లబ్ధిదారులంతా స్వచ్ఛందంగా బస్సు యాత్రకు తరలి వస్తున్నారని పేర్కొన్నారు. మళ్లీ జగన్ వస్తేనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని క్షేత్ర స్థాయిలో ప్రజలు చర్చించుకుంటున్నారని చెప్పారు. ఎన్ని పార్టీలు కూటమి కట్టినా ప్రజలంతా జగన్ వెంటే ఉన్నారని స్పష్టం చేశారు. చంద్రబాబు చేప్పే మాయ మాటలు నమ్మే స్థితిలో ప్రజలు లేరన్నారు. పింఛన్లు ఇవ్వకుండా వలంటీర్లను అడ్డుకున్న చంద్రబాబుపై లబ్ధిదారులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నట్లు తెలిపారు. వలంటీర్లు రాజీనామాలు చేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల్ని గెలిపించుకునేందుకు కంకణం కట్టుకున్నారన్నారు. పొత్తుల కారణంగా ఎక్కడ ఏ గుర్తుకు ఓటేయాలో తెలియని అయోమయం వారిదైతే, వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు మాత్రం రాష్ట్ర వ్యాప్తంగా ఫ్యాన్ గుర్తుపై ఓటేయాలన్న నిర్ణయానికి జనాలు వచ్చారని పేర్కొన్నారు. రాయలసీమ ప్రాంతంలో ప్రతి రోజు టీడీపీ నుంచి అధిక సంఖ్యలో ముఖ్య నాయకులు వైఎస్సార్‌సీపీలో చేరడం పార్టీలో మరింత జోష్ పెంచుతోందన్నారు.

59 మంది వలంటీర్ల రాజీనామా

అచ్యుతాపురం:అచ్యుతాపురం మండలంలో వలంటీర్ల రాజీనామా పరంపర మొదలైంది. పార్టీలకతీతంగా సేవ చేస్తున్న వలంటీర్లపై విపక్షాలు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడంతో రాష్ట్ర వ్యాప్తంగా వారిలో ఆగ్రహావేశాలు పెల్లుబికాయి. నిబంధనల పేరిట తమ చేతలు కట్టేయాలనుకున్న విపక్షాల కుట్రలకు నిరసనగా ఇన్నాళ్లూ ప్రజలకు అవసరమైన సేవలు అందించేందుకు దోహదపడిన వలంటీర్ విధుల నుంచి తప్పుకున్నారు. మండలంలోని తంతడికి చెందిన 12 మంది, చోడపల్లిలోని 29 మంది, దోసూరులోని 17 మంది, గతంలో రాజీనామా చేసిన ఒకరితో కలిపి మొత్తం 59 మంది రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేసినట్లు పేర్కొన్నారని ఎంపీడీవో సురేష్‌కుమార్ తెలిపారు. అనంతరం పలువురు రాజీనామా చేసిన వలంటీర్లు ఎమ్మెల్యే కన్నబాబుని కలిసి తమ సంఘీభావాన్ని తెలిపారు.



ఎంపీడీవోకు రాజీనామా పత్రాలు అందించిన తంతడి వలంటీర్లు

మహిళా పోలీసుపై దాడి ఘటనలో మాజీ ఎంపీటీసీపై కేసు

బుచ్చెయ్యపేట: మండలంలోని మంగళాపురంలో విధి నిర్వహణలో ఉన్న సచివాలయ మహిళా పోలీస్ కానిస్టేబుల్‌పై దాడిచేసిన మాజీ ఎంపీటీసీ సభ్యురాలు అల్లంకి ఉమాదేవిపై బుచ్చెయ్యపేట పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నెల 6న పింఛన్ నగదు తీసుకునేందుకు సచివాలయానికి వెళ్లిన టీడీపీకి చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యురాలు ఉమాదేవి పింఛన్ నగదు తన వద్దకు వచ్చి ఇవ్వాలని మహిళా పోలీస్ జంపా మహాలక్ష్మితో గొడవకు దిగారు. అంతేకాక విధి నిర్వహణలో ఉన్న మహిళా పోలీస్‌పై పరుష పదజాలంతో తిడుతూ, ఆమె మెడపై గోర్లతో గాట్లు పెట్టి మెడలో ఉన్న చైన్‌ను లాగి తెంచేశారు. అక్కడే విధి నిర్వహణలో ఉన్న తోటి సచివాలయ సిబ్బంది వీడియో తీస్తుండగా ఫోన్ లాక్కుని నేలకేసి కొట్టి, తమ ఊరిలో ఎలా ఉద్యోగం చేస్తారో? చూస్తానంటూ బెదిరించారు. దీంతో ఉమాదేవిపై చర్యలు తీసుకోవాలంటూ బాధిత మహిళా పోలీస్ మహాలక్ష్మి బుచ్చెయ్యపేట పోలీస్‌లకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు బుచ్చెయ్యపేట ఎస్‌ఐ డి.ఈశ్వరరావు వెల్లడించారు.

నూకాంబిక జాతరలో బాలల హక్కుల పరిరక్షణ

- చంటి పిల్లల తల్లులకు ప్రత్యేక క్యూలైన్లు

తుమ్మపాల: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం నూకాంబిక అమ్మవారి నెల రోజుల జాతరలో బాలల హక్కుల పరిరక్షణకు అధిక ప్రాధాన్యం కల్పించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, కార్మిక శాఖలతోపాటు ఆలయాధికారులకు ఆదేశాలు చేసినట్లు కమిషన్ సభ్యుడు గొండు సీతారాం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ ప్రాంగణంలో చంటి పిల్లల తల్లులు పాలు పట్టేందుకు ప్రత్యేక క్యూలైన్ల ఏర్పాటు చేయాలని, వేడి పాలు, బిస్కెట్లు అందించాలని సూచించారు. చంటి పిల్లలతో వచ్చే కుటుంబ సభ్యులకు దివ్యాంగ బాలలకు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేయాలన్నారు. నడవలేని బాలలకు ట్రైసైకిళ్లు, ఆలయ ప్రాంగణంలో వడదెబ్బకు గురికాకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. పిల్లల వైద్య నిపుణులు, పారా మెడికల్ సిబ్బందితో కావాల్సిన మందులు, అంబులెన్స్‌లు అందుబాటులో ఉంచుతూ ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించాలన్నారు. ఆలయ ప్రాంగణంలో తప్పిపోయిన పిల్లలను వారి తల్లిదండ్రుల చెంతకు చేర్చేందుకు చైల్డ్ లైన్ 1098, స్త్రీ, శిశు సంక్షేమ, పోలీసు శాఖలు ప్రత్యేక దృష్టి నిలపాలని సూచించారు. పరిసర ప్రాంతాల్లో బాల యాచకులు, బాల కార్మికులు లేకుండా కార్మిక శాఖాధికారులు కట్టుదిట్టమైన ప్రణాళికా చర్యలు చేపట్టాలన్నారు.

నేటి నుంచి భావనారుషి కల్యాణోత్సవాలు

రాంబిల్లి: కొత్తపేట గ్రామంలో భద్రావతి సమేత భావన రుషీశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు మంగళవారం ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు నిర్వాహకులు ఏర్పాటు పూర్తి చేశారు. మంగళవారం పత్రి మహోత్సం నిర్వహిస్తారు. బుధవారం కల్యాణ మహోత్సవం జరగనుంది. ఈ సందర్భంగా భారీ అన్నసమారాధనతో పాటు పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

'కూటమి'లో ఫొటో గొడవ

పవన్ ఫొటో చిన్నగా ముద్రించడంపై టీడీపీ నేతలను నిలదీసిన జనసేన కార్యకర్తలు



పవన్‌కల్యాణ్ ఫొటో కనీకనిపించకుండా ముద్రించిన ఫ్లెక్సీ

ఆనందపురం: భీమిలి కూటమిలో ఫొటో చిచ్చురేపింది. ఫ్లెక్సీపై తెలుగుదేశం అధినేత చంద్రబాబు ఫొటో పెద్దది పెట్టి..జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఫొటో చిన్నగా ముద్రించడంపై ఆ పార్టీ నేతలు ఎదురుతిరగారు. పవన్ కల్యాణ్ త్యాగం వల్లే భీమిలి సీటు టీడీపీకి కేటాయించిన విషయాన్ని మర్చిపోతే తేడాలు వస్తాయని గట్టిగా తెలుగుదేశం నాయకులను హెచ్చరించారు. ఈ ఫొటో వెనుక ఏం జరిగిందంటే.. మండలంలోని పెద్దిపాలెంలోని ఓ ప్రైవేట్ కన్వెన్షన్ హాలులో సోమవారం భీమిలి నియోజకవర్గం టీడీపీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఓ పెద్ద ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఆ ఫ్లెక్సీలో చంద్రబాబు ఫొటో పెద్దది వేసి, పవన్‌ను ఫొటోను రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులతో కలిసి చిన్నదిగా ముద్రించారు. ఇది గమనించిన జనసేన కార్యకర్తలు గొడవకు దిగారు. తమ అధినేత పవన్ త్యాగం వలనే భీమిలి టికెట్ టీడీపీకి కేటాయించారని, అటువంటిది పవన్ ఫొటో చిన్నగా ఎలా వేస్తారని టీడీపీ నేతలను నిలదీశారు. దీంతో కంగుతిన్న టీడీపీ నాయకులు వెంటనే పవన్ పెద్ద ఫొటోను తెచ్చి ఫ్లెక్సీపై అతికించారు. పనిలోపనిగా ప్రధాని మోదీ ఫొటో కూడా పెద్దది తీసుకొచ్చి అతికించారు. కూటమి నేతల్లో సఖ్యత లేదనడానికి ఇంతకంటే నిదర్శనం మరొకటి ఉండదని సమావేశంలో పాల్గొన్నవారే గుసగుసలాడారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌కు జీడి తోట దగ్ధం

- ఆరెకరాల తోట నాశనం, రూ.7 లక్షల ఆస్తి నష్టం



అగ్ని ప్రమాదంలో దగ్ధమైన జీడితోట

బుచ్చెయ్యపేట: మండలంలోని ఎల్ శింగవరం గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా సంభవించిన అగ్ని ప్రమాదంలో ఐదెకరాల్లో జీడి తోట దగ్ధమైంది. గ్రామానికి చెందిన కరణం త్రిమూర్తులుకు చెందిన జీడి తోటల వద్ద విద్యుత్ వైర్లు కలిసిపోయి అగ్గినిప్పులు రాలి, మంటలు వ్యాపించాయి. గాలికి మంటలు మరింతగా పెరిగి త్రిమూర్తులకు చెందిన ఐదెకరాల్లో జీడితోట కాలిపోయింది. పూతపిందెతో ఉన్న జీడితోట కాలిపోవడంతో సుమారు రూ.7 లక్షలకుపైగా ఆస్తి నష్టం వాటిల్లినట్లు రైతు వాపోతున్నాడు. స్థానికుల సమాచారం మేరకు రావికమతం అగ్నిమాపక సిబ్బంది వచ్చినప్పటికీ, పొలాల్లోకి వెళ్లే రహదారి సౌకర్యం లేక మంటలను వెంటనే అదుపుచేయడం కష్టమయింది. నష్టపోయిన రైతును ఆదుకోవాలని ప్రభుత్వాన్ని స్థానికులు కోరుతున్నారు.

రైల్వేస్టేషన్‌లో కుంగిన పాదచారుల వంతెన

- తప్పిన పెను ప్రమాదం.. వంతెన మూసివేత
- నేడు అందుబాటులోకి తీసుకువస్తామన్న డీఆర్ఎం



ప్లాట్‌ఫాంలపై రాకపోకల నిషేధం



కుంగిన పాదచారుల వంతెన

తాటిచెట్లపాలెం : విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో మూడో నెంబర్ గేట్ నుంచి స్టేషన్‌లోకి ప్రవేశించే పాదచారుల వంతెన సోమవారం ఉదయం 8.30 గంటల ప్రాంతంలో కుంగింది. దీంతో కింద ఉన్న విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. ఆ సమయంలో ప్రయాణికుల రద్దీ గానీ, రైళ్ల గానీ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. రైల్వే అధికారులు వెంటనే విద్యుత్ సరఫరా నిలిపివేశారు. ఈ వంతెన మీదుగా ప్రయాణికుల రాకపోకలను నిషేధించారు. విషయం తెలుసుకున్న డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరబ్ ప్రసాద్ రైల్వేస్టేషన్‌కు చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. ఉన్నతాధికారులతో సమీక్షించి పునరుద్ధరణ పనులు ప్రారంభించామని తెలిపారు. మూడు, నాల్గవ నెంబర్ ప్లాట్‌ఫాంల నుంచి రైళ్ల రాకపోకలు నిలిపివేసినట్లు తెలిపారు. ప్రయాణికుల సౌకర్యార్థం 4, 5 ప్లాట్‌ఫాంలలో కొత్త లిఫ్ట్‌లను అందుబాటులోకి తీసుకువచ్చామని చెప్పారు. ఈ పునరుద్ధరణ పనులు మంగళవారం ఉదయం 8 గంటలకు పూర్తిచేస్తామన్నారు. సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ (ఆర్పీఎఫ్) అజయ్‌ప్రకాష్ దూబే కూడా రైల్వేస్టేషన్‌కు చేరుకొని ఘటనా స్థలాన్ని పరిశీలించి ఆర్పీఎఫ్ సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రయాణికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని సిబ్బందికి సూచించారు.

12 మద్యం బాటిళ్ల స్వాధీనం

అనకాపల్లి:మద్యం క్వార్టర్ బాటిళ్లు తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ పోలీస్ స్టేషన్ హెచ్‌సీ రామకృష్ణ సోమవారం తెలిపారు. హెచ్‌సీ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మెయిన్ రోడ్డులో వాహనాలను తనిఖీ చేస్తుండగా బుచ్చయ్యపేట మండలం, శివరామపురం గ్రామానికి చెందిన నమ్మి సన్యాసిరావు 12 మద్యం క్వార్టర్ బాటిళ్లు తరలిస్తూ పట్టుబడ్డాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ తెలిపారు.

క్లుప్తంగా

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరికలు



వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకులు

కశింకోట: మండలంలోని పరవాడపాలెంలో టీడీపీకి చెందిన వార్డు సభ్యునితో సహా 15 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. వైఎస్సార్‌సీపీ అసెంబ్లీ అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ నిర్వహించిన గడప గడపకు ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం రాత్రి టీడీపీకి చెందిన స్థానిక 5వ వార్డు సభ్యుడు యలమంచిలి నాయుడుతోపాటు గొలగాని సాయి, మాటూరి శివ, పరవాడ సతీష్, పల్ల నాయుడు, పల్ల శ్రీను, ఓరికంటి శ్రీనివాస్, పక్కుర్తి అప్పారావు తదితరులు వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీ గ్రామ అధ్యక్షుడు గొంతిన శివబాబు ఆధ్వర్యంలో చేరిన వీరికి భరత్‌కుమార్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ అభ్యర్థుల ఘన విజయానికి కృషి చేయాలని కోరారు.

14న పక్షులకు తిండి గింజలు, గూళ్లు

అనకాపల్లి: స్థానిక గ్రీన్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 14న అనకాపల్లి పట్టణంలోని వివిధ పార్కుల ఆవరణలో వేసవిని దృష్టిలో ఉంచుకుని పక్షులకు తిండి గింజలు (వరి కుంచులు), తాగునీటి మట్టి పాత్రలు, పక్షుల గూళ్లు ఏర్పాటు చేయనున్నట్లు క్లబ్ వ్యవస్థాపకుడు కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. వేసవికాలంలో పక్షుల గొంతు తడిపేందుకు ఇంటి బయట కాసిన్ని నీళ్లు, గుప్పెడు గింజలు ఉంచాలని ప్రజలను కోరారు. ప్రతి ఒక్కరూ సమస్త జీవుల భద్రతకు తమ వంతు కృషి చేయాలన్నారు.

స్థిరంగా కూరగాయల ధరలు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం వారపు సంతలో కూరగాయల ధరలు సోమవారం దాదాపు స్థిరంగా ఉన్నాయి. కిలో టమాటా, ఉల్లిపాయ రూ.25, బంగాళాదుంప, క్యాబేజీ రూ.30, బెండకాయ, దొండకాయ, వంకాయ రూ.40, క్యారెట్, బీట్రూట్, బీరకాయ రూ.60, చిక్కుడు రూ.80కి విక్రయాలు సాగాయి.

నేడు ఉగాది పంచాంగ పఠనం

కశింకోట: మండలంలోని పలు రామాలయాల్లో ఉగాది సందర్భంగా మంగళవారం పంచాంగ పఠనం, శ్రవణాలు నిర్వహించనున్నట్లు ఆయా ఆలయ ప్రతినిధులు తెలిపారు. గవరపేటలోని వేంకటేశ్వరస్వామి ఆలయం, కనకమహాలక్ష్మి వీధి, కస్పావీధి, పూసర్లవీధి రామాలయాల్లోను పురోహితులు పంచాంగ పఠనం చేయనున్నట్లు పేర్కొన్నారు.

బెల్లం ధరలు

అనకాపల్లి మార్కెట్‌కు శనివారం 5,483 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,800	4,230
మొదటి రకం	3,580	4,160
రెండో రకం	3,430	3,830
మూడోరకం	3,280	3,460

అనకాపల్లి సినిమాలు

భరతనాట్యం	రాజా
గాడ్జిల్లా వర్సెస్ కాంగ్ (తెలుగు 3డి)	సత్యనారాయణస్క్రీన్-1
టిల్లు స్క్వేర్	సత్యనారాయణస్క్రీన్-2
ఫ్యామిలీ స్టార్	షిర్డిసాయి
ఫ్యామిలీ స్టార్	పర్తిసాయి
మంజుమ్మెల్ బాయ్స్	వెంకటేశ్వర
ప్రేమలు	శ్రీసత్య
టిల్లు స్క్వేర్	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 40 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-12 యూనిట్లు, బీ పాజిటివ్-16 యూనిట్లు, ఓ పాజిటివ్-10 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నిషియన్ యు.లోకేష్(9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 412 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 386 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.



- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో శరవేగంగా అభివృద్ధి
- రూపురేఖలు మారిన గొలగాం పంచాయతీ గ్రామాలు
- జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ప్రైమరీ స్కూల్
- గ్రామానికి సంక్షేమ లబ్ధి రూ.17.42 కోట్లు

గ్రామాలు అభివృద్ధి చెందితే దేశమే అభివృద్ధి చెందుతుంది. ఇది జాతిపిత గాంధీ సూచించిన గ్రామస్వరాజ్య సూత్రం. స్వతంత్ర భారత దేశంలో దాన్ని చిత్తశుద్ధితో అమలు చేస్తున్న ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే. సచివాలయ వ్యవస్థ ద్వారా గ్రామ కేంద్రంగా పాలనను తీసుకొచ్చారు. దాంతోపాటే అభివృద్ధిని వికేంద్రీకరించారు. అందుకు నిదర్శనమే గొలగాం పంచాయతీలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలు.

గొలగాంలో.. అభివృద్ధి వ్యయం రూ.5 కోట్లు



గుమస్తా కాలనీలో కొత్తగా వేసిన సీసీ రహదారి



కొత్త తలారివానిపాలెంలో నిర్మించిన వెల్‌నెస్ సెంటర్



రైతు భరోసా కేంద్రం

అనకాపల్లి: మండలంలోని గొలగాం పంచాయతీ బ్రిటీష్ కాలంలో ఏర్పడింది. ఈ పంచాయతీ పరిధిలో గొలగాం, గొలగాం కాలనీ, వైశ్య కాలనీ, గుమస్తాల కాలనీ, పాతతలారివానిపాలెం, కొత్త తలారివానిపాలెం, ఎల్లారమ్మ బీసీ కాలనీ, ఎల్లారమ్మ ఎస్సీ కాలనీ తదితర 8 గ్రామాలకు చెందిన 4,860 మంది ప్రజలు జీవిస్తున్నారు. గత ప్రభుత్వాలు ఈ పంచాయతీని చాలా వరకు నిర్లక్ష్యం చేశాయి. గ్రామాల అభివృద్ధి అంటే ఏంటో తెలియని పరిస్థితిలోకి నెట్టేశాయి. సీఎం జగన్ నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామ రూపురేఖలే మారిపోయాయి. పంచాయతీకి అవసరమైన అన్ని వసతుల్నీ కల్పించారు. ఇందుకు ఈ ప్రభుత్వ హయాంలో ఏకంగా రూ.5 కోట్లకుపైగా ఖర్చు చేశారు.

గ్రామంలో ప్రధాన అభివృద్ధి

- పంచాయతీ పరిధిలో జగనన్న కాలనీ లే అవుట్లు రెండు చోట్ల వేశారు. స్థానికులు 136 మంది, అనకాపల్లి పట్టణంలోని ఇళ్లు లేని 1500 మంది లబ్ధిదారులకు స్థలాలిచ్చి, గృహ నిర్మాణానికి అవసరమైన ఆర్థిక సాయం ప్రభుత్వం అందించింది.
- కొత్తతలారివానిపాలెం ప్రాథమిక పాఠశాలకు 2022లో రూ.23 లక్షలతో అన్ని వసతులు కల్పించారు. దీంతో మౌలిక వసతులు, చదువుకు అనువైన వాతావరణంలో జాతీయ అవార్డును దక్కించుకుంది.
- గొలగాం పాఠశాలను రూ.12 లక్షలతోను, ఎల్లారమ్మ బీసీకాలనీ పాఠశాలను రూ.10 లక్షలతో అభివృద్ధి చేశారు.
- రూ.32 లక్షలతో గ్రామ సచివాలయానికి, రూ.24 లక్షలతో రైతు భరోసా కేంద్రానికి, రూ.26 లక్షలతో విలేజ్ హెల్త్ క్లినిక్‌లకు నూతన భవనాలను నిర్మించి అందుబాటులోకి తెచ్చారు.
- పంచాయతీ పరిధిలో రెండు కిలోమీటర్ల మేర రూ.30 లక్షలతో సీసీ రోడ్లు నిర్మించారు.
- రూ. కోటీ 10 లక్షలతో అన్ని ప్రాంతాలకు నూతన డ్రైనేజీ వ్యవస్థను కల్పించారు.
- ఎల్లారమ్మ బీసీ కాలనీలో రూ.24 లక్షలతో కల్యాణ మండపాన్ని నిర్మించారు.

అత్యధిక సంక్షేమ లబ్ధి

పంచాయతీ పరిధిలో ప్రజలకు వివిధ సంక్షేమ పథకాల రూపంలో ఏకంగా రూ.17 కోట్ల 41 లక్షల 92 వేల 69 లబ్ధి చేకూరింది. ఇందులో డీబీటీ పద్ధతిలో రూ.12.05 కోట్లు, నాన్ డీబీటీ పద్ధతిలో రూ.5.37 కోట్ల మేర ప్రభుత్వం నిధులు వెచ్చించింది. కుటుంబంలో నలుగురు సభ్యులుంటారనుకున్నా.. ఒక్కో కుటుంబానికి సగటున కనీసంగా రూ.1.50 లక్షల ప్రయోజనం దక్కింది. ఈ స్థాయిలో సంక్షేమ లబ్ధి గతంలో ఎన్నడూ లేదని గ్రామస్తులు ఆనందంగా చెప్తున్నారు.

మా గ్రామం రూపురేఖలు మారాయి



మా గ్రామంలో రైతులు, రోజు కూలీలు ఎక్కువ. గత ప్రభుత్వంలో ప్రతి పనికీ పట్టణానికి వెళ్లేవాళ్లం. జగన్ సీఎం అయ్యాక అలాంటి కష్టాలేవీ లేవు. నా 40 ఏళ్ల వయసు నుంచి పలు ప్రభుత్వాల పరిపాలనను చూశాను. ఏ ప్రభుత్వంలోనూ మా ఊరు ఇంత గొప్పగా అభివృద్ధి చెందలేదు. అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయి. రోడ్లు, డ్రైనేజీలు, ప్రభుత్వ కార్యాలయాలు అన్ని వసతులతో మా ఊరి రూపురేఖలే మారిపోయాయి.

– కొరిబిల్లి చంద్రశేఖర్

ఇంతకంటే గొప్ప పాలన చూడలేం



సచివాలయం, ఆర్బీకే, వెల్‌నెస్ సెంటర్ల ఏర్పాటుతో ప్రతి అవసరమూ ఊరిలోనే తీరిపోతోంది. ప్రభుత్వ సేవల కోసం అనకాపల్లి పట్టణానికి వెళ్లే ప్రయాస దాదాపు లేకుండా పోయింది. అభివృద్ధి, సంక్షేమం అంటే ఏంటో గత ఐదేళ్లలోనే చూశాం. ఈ ప్రభుత్వంలో చదువుకునే పిల్లల నుంచి వృద్ధుల వరకు అందరికీ అవసరమైన ప్రతి సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చారు. ఇంతకంటే గొప్ప పాలన చూడలేం. సీఎం జగన్‌కు మా గ్రామ ప్రజలం రుణపడి ఉంటాం.

– నందరపు అప్పలనాయుడు

స్టీల్‌ప్లాంట్‌పై పవన్‌ది ఎన్నికల ప్రేమ



సమావేశంలో మాట్లాడుతున్న గంటా శ్రీరామ్

అనకాపల్లి: ఎన్నికలు సమీపించడంతో ఓట్ల కోసం స్టీల్‌ప్లాంట్‌పై పవన్‌కల్యాణ్‌కు ప్రేమ పెరిగిపోయిందని సీపీఎం మండల కన్వీనర్ గంటా శ్రీరామ్ అన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనకాపల్లిపై సరైన అవగాహన లేకపోవడం, స్టీల్‌ప్లాంట్‌పై స్థానిక నేతలు రాసిచ్చిన స్క్రిప్ట్‌ను బహిరంగ సభలో చదవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. బీజేపీతో సన్నిహితంగా మెలిగిన పవన్ మోదీని ఎందుకు ప్రశ్నించలేదన్నారు. విశాఖ రైల్వేజోన్, పోలవరం ప్రాజెక్టు, ఉత్తరాంధ్ర అభివృద్ధి విషయంలో పవన్ ఆది నుంచీ వెనకడుగు వేస్తూనే ఉన్నారని ఆక్షేపించారు. ప్రభుత్వ ఉద్యోగులకు సీపీఎస్‌ను రద్దు చేస్తామని ప్రకటించకుండా, న్యాయం చేస్తామనడం ఉద్యోగులను మోసం చేయడమేనన్నారు. పవన్ మాట్లాడిన మాటలకు ఉత్తరాంధ్ర ప్రజలు ఛీ కొడుతున్నారన్నారు. సీపీఎం నాయకులు బి.ఉమామహేశ్వరరావు, కాళ్ల తేలయ్యబాబు పాల్గొన్నారు.

ఉచిత మజ్జిగ చలివేంద్రం

అనకాపల్లి: స్థానిక వెదుళ్లవారి వీధిలో సోమవారం ఉచిత మజ్జిగ చలివేంద్రాన్ని వాసవీ క్లబ్ సీనియర్ ప్రతినిధి చిత్తూరి కామేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజురోజుకు ఉష్ణోగ్రతల్లో మార్పులు సంభవిస్తున్నాయని, వాతావరణ సమతుల్యతకు ప్రతి ఒక్కరూ చెట్లునాటి వాటి పర్యవేక్షణ కూడా బాధ్యతగా తీసుకోవాలని కోరారు. చలివేంద్రాల ఏర్పాటుతో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి పట్టణానికి వచ్చే వారికి ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బొండా రమేష్‌గుప్తా, క్లబ్ అధ్యక్షుడు కె.సత్యనారాయణ, సెక్రటరీ బిళ్లపాటి గణేష్, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే అభివృద్ధి, సంక్షేమం



గడప గడపకు ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్



చంటి బిడ్డను ఎత్తుకుని ఎన్నికల ప్రచారం చేస్తున్న భరత్‌కుమార్



కాపుశెట్టివానిపాలెంలో వృద్ధులను ఫ్యాన్ గుర్తుపై ఓటేయాలని అభ్యర్థిస్తున్న మలసాల భరత్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న గొర్లి సూరిబాబు

- జోరుగా ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ ప్రచారం
- ఊరూ వాడా నీరాజనాలు పడుతున్న ప్రజలు

అనకాపల్లి: నాడు-నేడు పథకంలో భాగంగా గ్రామీణ స్థాయి నుంచి విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వ పాఠశాలల్ని కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ అన్నారు. మండలంలోని కాపుశెట్టివానిపాలెంలో సోమవారం రాత్రి నిర్వహించించిన ఎన్నికల ప్రచారంలో ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. రానున్న ఎన్నికల్లో మరోసారి సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకుని, మరింత అభివృద్ధికి సహకరించాలని కోరారు. తొలుత గ్రామ దేవత మరిడిమాంబ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గడప గడపకు ప్రచారం నిర్వహించారు. మహిళలు, వృద్ధులు అడుగడుగునా నీరాజనాలు పలికారు. మహిళలు హారతులు పట్టారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భావి తరాల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని విద్య, వైద్యంపై అత్యధిక నిధులు వెచ్చించిన ప్రభుత్వం వైఎస్సార్‌సీపీయేనన్నారు. నిరుపేదల సొంతింటి కల నెరవేర్చేలా అర్హులందరికీ జగనన్న కాలనీలో గృహాలను నిర్మించి సర్వహక్కులు పొందేలా రిజిస్ట్రేషన్ కూడా చేసి ఇచ్చిన ఘనత సీఎం జగన్‌దేనని కొనియాడారు. మే 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాల్సిందిగా అభ్యర్థించారు. ప్రచారంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు, పార్టీ రాష్ట్ర యువజన విభాగ కార్యదర్శి పలకా రవి, మండల పార్టీ అధ్యక్షుడు పెద్దిశెట్టి గోవింద్, ఎంపీటీసీ మంత్రి సంతోషం, గ్రామ నాయకులు సత్తిబాబు, బంటు ఏడుకొండలు, కోట సత్యనారాయణ, గనిరెడ్డి రమణబాబు, కాపుశెట్టి రమేష్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకు ప్రచారం మరింత ముమ్మరం

అనకాపల్లి: రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు పార్టీ గెలుపు కోసం గడప గడపకు వెళ్లి ప్రచార కార్యక్రమాలను ముమ్మరం చేయాలని ఎంపీపీ గొర్లి సూరిబాబు పిలుపునిచ్చారు. మండలంలోని బవులవాడ, దర్జీనగర్ గ్రామాల్లో పార్టీ శ్రేణులతో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలు పేదలకు, పెత్తందార్లకు మధ్య జరుగుతున్నాయని, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో చేసిన సంక్షేమం, అభివృద్ధిని ప్రతి ఒక్కరికీ వివరించాలని కోరారు. ఫ్యాన్ గుర్తుపై ఓటేసి ఉపముఖ్యమంత్రి, అనకాపల్లి ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు, ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్‌లను అత్యధిక మెజార్టీతో గెలిపించుకునేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని కోరారు. సమావేశంలో బవులవాడ గ్రామ పార్టీ అధ్యక్షుడు మజ్జి వెంకటఅప్పారావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ దాడి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కొత్త అమావాస్య జాతర



తుమ్మపాల గ్రామంలో నూకాంబిక అమ్మవారిని దర్శించుకున్న మలసాల భరత్‌కుమార్



కశింకోటలో అసెంబ్లీ అభ్యర్థి మలసాల భరత్‌కుమార్‌కు నూకాంబిక అమ్మ వారి చిత్ర పటం బహూకరిస్తున్న ఆలయ సిబ్బంది



నూతలగుంటపాలెంలో అమ్మవారిని దర్శించుకుంటున్న మలసాల భరత్‌కుమార్



తాకాశివీధి నూకాంబిక అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

అనకాపల్లి: పట్టణ, మండలం పరిధిలోని పలు గ్రామాల్లో నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య వేడుకలు సోమవారం అత్యంత వైభవంగా జరిగాయి. మండలంలోని తుమ్మపాల ఇందిరానగర్‌లో నూకాంబిక అమ్మవారిని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు.

- స్థానిక తాకాశివీధి నూకాంబిక అమ్మవారి ఆలయానికి తెల్లవారుజాము నుంచే భక్తులు పోటెత్తారు. అమ్మవారికి మొక్కులు తీర్చుకుని, పసుపు కుంకుమలతో పూజించారు. అమ్మవారి ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ట్రస్ట్‌బోర్డు చైర్మన్ తాకాశి రాజేష్ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పలు స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో ఉచిత మజ్జిగ, తాగునీరు, ప్రసాద వితరణ వంటి కార్యక్రమాలు నిర్వహించారు.
- మండలంలోని అక్కిరెడ్డిపాలెం, మార్టూరు, ఎన్టీఆర్ కాలనీ, మామిడిపాలెం, కూండ్రం, తదితర గ్రామాల్లో ఆయా కమిటీల ఆధ్వర్యంలో నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య వేడుకలు ఘనంగా జరిగాయి,

కశింకోట: మండలంలోని పలు గ్రామాల్లో నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య ఉత్సవాలు సోమవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కశింకోటలోని స్వయంభూ నూకాంబిక అమ్మవారిని భక్తులు ఎక్కువగా దర్శించుకున్నారు. చీరలు, రవికెలు, తల నీలాలు, అరటి గెలలు తదితర రూపాల్లో అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. వైఎస్సార్‌సీపీ అనకాపల్లి అసెంబ్లీ అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ అమ్మవారిని దర్శించుకుని, పూజలు చేశారు. ఆలయ అర్చకుడు వేగి శివ గణేష్ ఆధ్వర్యంలో ఆలయ మర్యాదలతో కండువా వేసి, సత్కరించి అమ్మవారి చిత్ర పటాన్ని బహూకరించారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు తదితరులు ఆయన వెంట పాల్గొన్నారు.

- ఉగ్గినపాలెం, తాళ్లపాలెం, నరసింగబిల్లి, నూతలగుంటపాలెం గ్రామాల్లోనూ నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య ఉత్సవాలు, జాతరలు వైభవంగా జరిగాయి. ఆ ఆలయాలను కూడా ఎమ్మెల్యే అభ్యర్థి భరత్‌కుమార్ దర్శించుకున్నారు. కార్యక్రమాల్లో ఆయన వెంట ఎంపీపీ కలగా లక్ష్మి, పార్టీ మండలాధ్యక్షుడు మలసాల కిషోర్, పార్టీ మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాష, సంస్కృతుల్ని పరిరక్షించుకోవాలి



విజేతకు పుస్తకాన్ని అందిస్తున్న రంగబాబు

అనకాపల్లి: తెలుగు సంవత్సరాది ఉగాదిని ప్రతి ఒక్కరూ ఆనందంగా నిర్వహించుకోవాలని అనకాపల్లి సాహితీ మిత్రులు కన్వీనర్ గొంతిన రంగబాబు కోరారు. స్థానిక శాఖవీధి శాఖా గ్రంథాలయంలో సోమవారం కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కవులు, రచయితలు తమ రచనల ద్వారా సమాజంలో మార్పులు తీసుకువస్తారన్నారు. ప్రకృతిలో కోయిలలు పలికే స్వాగతంలా కవికోయిలలు ఉగాదిని స్వాగతిస్తాయని, ఏటా కవి సమ్మేళనం, కవి సత్కారం నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. తెలుగు భాషను, సంస్కృతిని రక్షించుకోవాల్సిన బాధ్యత నేటి యువతరంపై ఉందన్నారు. అంతకుముందు కవి సమ్మేళన పోటీల్లో గెలుపొందిన కవులకు బహుమతులుగా పుస్తకాలను అందించారు. కార్యక్రమంలో శాఖాగ్రంథాలయం అధికారి కె.శ్రీనివాసరావు, సాహితీ మిత్రుల సభ్యులు కోరాడ అప్పలరాజు, త్రినాథరావు, శ్రీదేవి, బుద్ధ వీరునాయుడు, శ్రీనివాసరావు, జీఎస్‌కే సాయిబాబు పాల్గొన్నారు.

నూకాంబిక ఆలయాలకు ఉత్సవ శోభ



కశింకోటలో నూకాంబిక ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు



తాళ్లపాలెంలో నూకాంబిక సన్నిధిలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్



మహిళల భజన కార్యక్రమం



విద్యుద్దీపాలంకరణలో నూకాంబిక ఆలయ ప్రాంగణం

కశింకోట: స్థానికనూకాంబిక అమ్మ వారి ఆలయంలో కొత్త అమావాస్య ఉత్సవాలు పురస్కరించుకుని సోమవారం రాత్రి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతుల్ని అలరించాయి. డప్పులు మేళాలతో ప్రజలు భారీ ఊరేగింపుగా ఆలయానికి వచ్చారు. మహిళల భజన కార్యక్రమంలో భక్తి పాటలతో ఓలలాడించారు. గోవిందరావు కాలనీకి చెందిన మహిళా బృందం కోలాటాలు ప్రదర్శించారు. భక్తులు రాత్రి కూడా ఉత్సాహంగా ఊరేగింపుగా తరలి వచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. అమ్మవారి ఆలయాన్ని, ప్రాంగణాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. ఉగాది పురస్కరించుకుని మంగళవారం కూడా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త వేగి శివగణేష్ తెలిపారు. తాళ్లపాలెంలో నూకాంబిక అమ్మవారిని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి అసెంబ్లీ అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ దర్శించుకుని, పూజలు చేశారు. పార్టీ శ్రేణులు పాల్గొన్నాయి.